# సాక్షి మంచిర్యాల

మంగళవారం । 4 । జూలై । 2023




## ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

గురుపౌర్ణమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలతో సన్మానించారు. 9లో ▸

## నేడు అఖిలపక్ష సమావేశం

పాతమంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణంపై అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు జల సాధన సమితి నాయకుడు నైనాల గోవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం హాజరవుతారని తెలిపారు.

గరిష్టం/కనిష్టం
35.0 /27.0

## వాతావరణం

ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.

## న్యూస్‌రీల్

### మొక్కలు నాటిన జిల్లా జడ్జి ప్రభాకర్‌రావు



మొక్కకు నీళ్లు పోస్తున్న జడ్జి ప్రభాకర్‌రావు

శ్రీరాంపూర్: జిల్లాకు బదిలీపై వచ్చిన నూతన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ ప్రధాన న్యాయమూర్తి కే.ప్రభాకర్‌రావు సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. మంచిర్యాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఉదయ్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ న్యాయమూర్తి అజయ్ ఉల్లం, చెన్నూరు జూనియర్ సివిల్ న్యాయమూర్తి సీ.సంపత్, సింగరేణి కార్పొరేట్ జనరల్ మేనేజర్(సేఫ్టీ) గురువయ్య ఏరియా ఎస్‌ఓటుజీఎం ఎం.రఘుకుమార్ పాల్గొన్నారు.

### ముగిసిన జిల్లాస్థాయి యువ ఉత్సవ్



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలఅర్బన్: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం సోమవారం ముగిసింది. పోటీల్లో పాల్గొన్న 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు కలిగిన 200 మంది కళాకారులు గ్రూప్‌డ్యాన్స్, ఫోక్, క్లాసికల్ నృత్యాలతో అలరించారు. గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే దివాకర్‌రావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు కళాత్మక రంగంలో జాతీయస్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, జిల్లా జాతీయ సేవా పథకం అధికారి చంద్రమోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

### దీర్ఘకాలిక సెలవుపై జన్నారం ఎఫ్‌డీవో

జన్నారం: జన్నారం అటవీ డివిజనల్ అధికారి (ఎఫ్‌డీఓ) సిరిపురం మాధవరావు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఆస్ట్రేలియా వెళ్తున్నందున ఉన్నతాధికారుల నుంచి సెలవు అనుమతి పొందారు. ఆయన స్థానంలో మంచిర్యాల జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. కాగా, ఎఫ్‌డీవో మాధవరావు నాలుగేళ్లుగా జన్నారంలో పని చేస్తున్నారు.

### సర్టిఫికేట్ల పరిశీలన




పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ)లో ఖాళీ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికేట్లను సోమవారం డీఈవో యాదయ్య పరిశీలించారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్-6, మండల స్థాయి డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు-4, జిల్లాస్థాయి డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు-1, సిస్టం ఎనలిస్ట్-1, జిల్లా స్థాయి ప్రోగ్రామింగ్ ఆఫీసర్-1, ఐఈఆర్పీ-10 పోస్టుల భర్తీకి సర్టిఫికేట్లు పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. తాత్కాలిక అర్హుల జాబితా మంగళవారం ప్రకటించనున్నట్లు డీఈవో తెలిపారు. రెండ్రోజులపాటు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు.

### ఆస్పత్రి మూసి వేయాలి

బెల్లంపల్లి: నిర్లక్ష్యంగా వైద్యమందించి ఓ పసివాడి మృతికి కారణమైన బెల్లంపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడిపై విచారణ పూర్తయ్యే వరకు ఆస్పత్రి మూసి వేయాలని అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట విద్యార్థి, యువజనులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం డీఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ, నాయకులు సాగర్, రాజేంద్రప్రసాద్, హరీష్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నంబరు మార్చి పట్టా!




1955-58నుంచే 11సర్వే నంబరులో 12.35ఎకరాలు ఉన్నట్లు అధికారుల వివరణ



11సర్వే నంబరుగా మార్చిన భూమిలో వేసిన వెంచరు



అటవీ భూములు హద్దుగా సర్వేనంబరు11 మ్యాపు



11సర్వే నంబరులో 1955-58లో 1.23 గుంటలే ఉన్నట్లు చూపిస్తున్న పహాణీ

- 31ఉరఫ్ 11లో 31నంబరు తీసివేత
- సర్వేనంబరు 11గా మార్చి విస్తీర్ణం పెంపు
- అటవీ శాఖ పిల్లర్లు గుర్తిస్తే అంతా బహిర్గతం
- 'సాక్షి' కథనంతో తిమ్మాపూర్ భూముల్లో మొదలైన విచారణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మందమర్రి మండలం తిమ్మాపూర్ శివారు బొక్కలగుట్టలో అటవీ భూమికి సంబంధించిన 31 సర్వే నంబరును మార్చి సర్కారు భూమిని అన్యాక్రాంతం చేసిన వ్యవహారంలో విచారణ మొదలైంది. గత నెల 29న 'సాక్షి' దినపత్రికలో 'సర్వే నంబరే మార్చేశారు!' శీర్షిక ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారుల్లో కలవరం మొదలైంది. భూమి అన్యాక్రాంతంలో అధికార పార్టీకి చెందిన వారు ఉండడంతో ప్రజాప్రతినిధులు సైతం సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. ఇక్కడి భూమిపై లోతుగా విచారణ జరపాలని ఆదేశించడంతో రెవెన్యూ అధికారులు తర్జన భర్జనలో పడ్డారు. మందమర్రి మండల రెవెన్యూ అధికారులు ఇక్కడి ఈ భూమిపై మొదటిసారిగా అంతా బాగుందని ఓ నివేదిక ఇచ్చి, ఇప్పుడు విచారణ జరుగుతుండడంతో తల పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇక అటవీశాఖ నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికేట్ ఇచ్చి చేతులు దులిపేసుకున్న తీరుపైనా విచారణలో తేలనుంది.

### 28ఎకరాల్లో పట్టాలకు ప్లాన్

అటవీశాఖకు(మహసూర) సంబంధించిన 2వేలకు పైగా ఎకరాల్లో 1986లో 40ఎకరాలు రెవెన్యూ శాఖ బదిలీ చేశారు. బొక్కలగుట్ట గ్రామస్తులకే అదే ఏడాది ఇళ్లపట్టాలు ఇచ్చారు. ఆ సమయంలో పూర్తిగా అటవీ ప్రాంతం కావడంతో ఎవరూ వెళ్లలేదు. అప్పటి రికార్డులు, స్థానికుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఓ భూసామి 11.12ఎకరాల భూములను రికార్డుల్లోకి ఎక్కించారు. తన కూతురు పేరుతో ఇద్దరు వ్యక్తులకు అమ్మేశారు. ఎటువంటి ఆధారం లేకుండా రిజిస్ట్రేషన్ శాఖ నుంచి విక్రయాలు చేశారు. 31ఉరఫ్ సర్వే నంబరు పరిధిలోని భూమిలో 11సర్వే నంబరుగా చూపిస్తూ మొత్తం 16మంది 28.22 ఎకరాల భూమి ఎక్కించారు. వీరంతా 1954నుంచి పహాణీల ప్రకారం రికార్డుల్లో లేరు. తిమ్మాపూర్ శివారు రామక్రిష్ణాపూర్ పట్టణం భీమా గార్డెన్ వెనక ఉన్న 11నంబరు తీసుకుని, బొక్కలగుట్టకు ఉన్న అటవీ భూమిని తమదిగా రికార్డులకు ఎక్కారు. మరోవైపు 2014వరకు 11సర్వే నంబరులో 1.23ఎకరాలే ఉంది. ఆ భూమి వారసులుగా ఉన్న ముగ్గురు పంచుకున్నారు. వీరు మాత్రమే అసలు పట్టాదారులు. కేవలం 1.23ఎకరాలు ఉన్న ఈ ఒరిజినల్ సర్వే నంబరులో ఏకంగా 28.22 ఎకరాలు కలిపి రెవెన్యూ శాఖ నుంచి పట్టా పొందేలా ప్రణాళిక వేశారు. వీరంతా 2014నుంచే పహాణీలో పేర్లు ఉన్నాయి. అంతకుముందు ఎక్కడా రికార్డుల్లో లేరు. చిత్రంగా ఎవరు ఏ ఆధారంతో పహాణీలకు వచ్చారో తెలియదు. 2005లో 11.12ఎకరాలు ఇద్దరికి అమ్మేసిన ఆ రెండు సర్వే నంబరులో 11.12ఎకరాలకు ఇటీవల వెంచరు వేసి ప్లాటింగ్ సిద్ధపడ్డారు. మిగతా వారి కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వక ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి.

### ఎవరిని కాపాడేందుకు?

31ఉరఫ్ 11 సర్వే నంబరును వాస్తవ 11సర్వేనంబరుకు కలిపి, అసలు భూమి కన్నా ఎక్కువగా విస్తీర్ణం పెంచి పట్టాలు పొందేలా రెవెన్యూ అధికారులు సాయ పడ్డారు. సమాచారం హక్కు చట్టం కింద వివరాలు కోరితే 11సర్వే నంబరు పక్కన హద్దులు 31, 135, 180, 183 సర్వే నంబర్లు ఉన్నట్లు రాత పూర్వకంగా ఇచ్చారు. ఎక్కడైనా సర్వే నంబరు 11పక్కన 9, 10, 11, 12 లేదా మరో వరస నంబర్లు ఉంటాయి కానీ సంబంధం లేని బొక్కలగుట్ట అటవీ భూమి సంబంధించిన సర్వే నంబర్లను వాస్తవ నంబరుకు హద్దులుగా ఉన్నట్లుగా చూపించారు. ఇక 1955నుంచి రెవెన్యూ రికార్డుల్లో 12.35 ఎకరాలు ఉన్నట్లు ఎక్కడా లేదు. వాస్తవానికి 2014 వరకు కూడా వాస్తవ సర్వే నంబరు ఉన్నది 1.23 ఎకరాలే. కేవలం ధరణి పోర్టల్‌లో అటవీ భూమిని కనిపించకుండా ఉండేందుకు బొక్కలగుట్టలోని ఉరఫ్ నంబరును, అదే నంబరును 11సర్వే నంబరుగా చూపించారు. ఇక్కడే అధికారుల తప్పిదం బయటపడిపోయింది. మహసూర భూములకు సంబంధించిన అటవీ శాఖ పిల్లర్లను గుర్తిస్తే కూడా ఎక్కడ ఏ హద్దులున్నది కూడా తేలనుంది. తాజాగా జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో మందమర్రి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎలాంటి నివేదిక ఇస్తారో, రెండు వేర్వేరు సర్వే నంబర్ల వ్యవహారంలో ఏమని సమాధానం ఇస్తారో తేలాల్సి ఉంది. అప్పుడు తప్పిదం చేసిన అధికారులను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారా? లేక మోకాపై ఉన్న వారినా? లేక తప్పుడు పత్రాలతో భూమిని విక్రయించిన వారినా? అని తప్పు తేల్చకుండా వారినే కాపాడేలా ఇప్పుడున్న రెవెన్యూ అధికారులు వ్యవహరించడం గమనార్హం.

# డిప్యూటేషన్ డాక్టర్లే దిక్కు!



ఎల్లక్కపేటలోని సింగరేణి డిస్పెన్సరీలో నిర్వహిస్తున్న చెన్నూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్

- వైద్య విధాన పరిషత్‌కు మారినా అదే తీరు
- పాత ఆస్పత్రి స్థలంలో నూతన భవన నిర్మాణం
- ఏడాదిన్నర కావస్తున్నా స్టాఫ్ విస్తరణ ఊసేలేదు..
- కొత్త భవనంలోనూ పాత పరికరాలేనా..?
- జీవో విడుదలైతే ప్రత్యేక బడ్జెట్, ఆధునిక పరికరాలు
- ఇదీ చెన్నూర్ సామాజిక ఆస్పత్రి తీరు..

చెన్నూర్: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యవిధాన పరిషత్‌కు మారితే మెరుగైన వైద్యసేవలు అందుతాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. చెన్నూర్ సీహెచ్‌సీని వైద్యవిధాన పరిషత్ లోకి మార్చి ఏడాది కావస్తున్నా ఆస్పత్రిలో నేటికీ పూర్తిస్థాయిలో వైద్యుల నియామకం జరుగలేదు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు డెప్యూటేషన్‌పై చెన్నూర్ సీహెచ్‌సీలో పనిచేస్తున్నారు. సీహెచ్‌సీకి చెన్నూర్‌తో పాటు కోటపల్లి, వేమనపల్లి, పక్కనే ఉన్న మహారాష్ట్ర ప్రాంతాల నుంచి రోగులు వస్తారు. రోజు వారిగా 150 నుంచి 250 మంది వైద్యసేవలు పొందుతున్నారు. వర్షాకాలంలో రోగుల సంఖ్య 250 నుంచి 300 వరకు ఉంటుంది.

### ఆధునిక హంగులతో భవన నిర్మాణం

చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతో మండలంలోని ఎల్లక్కపేట సింగరేణి డిస్పెన్సరీలోకి మార్చారు. పాత ఆస్పత్రి స్థలంలోనే రూ.7 కోట్ల నిధులతో ఆధునిక హంగులతో నూతన భవనం నిర్మిస్తున్నారు. వచ్చే నెలలో ఆస్పత్రి ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వైద్య విధానపరిషత్ నుంచి జీవో రాకపోవడంతో బడ్జెట్ సమస్య ఉంది. దీంతో కొత్త ఆస్పత్రిలో పాత పరికరాలే దిక్కయ్యేలా ఉన్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. నూతన భవనం ప్రారంభానికి ముందే జీవో విడుదలైతే ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. లేదంటే పాత పడకలు, పాత సామగ్రితోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి.

### నేటికీ విడుదల కాని జీవో

చెన్నూర్ సీహెచ్‌సీ 30 పడకల స్థాయిలో ఉంది. దీనిని అప్‌గ్రేడ్ చేస్తూ 50 పడకలకు పెంచాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు విన్నవించిన విషయం తెలిసిందే. అప్‌గ్రేడ్ మాట సంగతి అలా ఉంచితే 30 పడకల ఆస్పత్రి వైద్య విధాన పరిషత్ లోకి మారినట్లు నేటికీ జీవో విడుదల కాలేదు. దీంతో సౌకర్యాల కల్పనతో పాటు వైద్యులు, సిబ్బంది నియామకానికి నోచుకోకపోవడంతో అరకొర సిబ్బందితోనే వైద్యసేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వైద్యం కోసం ఈ ప్రాంతవాసులు పట్టణ ప్రాంతాలకు పరుగులు పెడుతున్నారు.

### మాతాశిశు ఆస్పత్రికి సైతం..

పట్టణంతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ చెన్నూర్‌కు వందపడకల ఆస్పత్రిని మంజూరు చేయించారు. రెండు నెలల క్రితం చెన్నూర్ పర్యటనకు వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ఎంసీహెచ్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయగా పనులు ప్రారంభమయ్యాయి. దీనికి సైతం జీవో విడుదల కాలేదని అధికారులు పేర్కొంటున్నారు.

### జీవో రాలేదు



చెన్నూర్ సీహెచ్‌సీ వైద్య విధాన పరిషత్ ఆధీనంలోకి వెళ్లినా జీవో మాత్రం రాలేదు. ప్రస్తుతం ఆరోగ్య కేంద్రంలో రోగులకు వైద్యసేవలందిస్తున్నాం. వైద్యులు డెప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న మాట వాస్తవమే. చెన్నూర్‌లో నిర్మిస్తున్న ఆస్పత్రి భవనం త్వరలోనే ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.

– డి.సత్యనారాయణ, సీహెచ్‌సీ వైద్యులు

# పాత కలెక్టరేట్‌ను హాస్టల్‌కు కేటాయించాలి

మంచిర్యాలటౌన్: పాత కలెక్టరేట్ భవనాన్ని ఎస్సీ ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్‌కు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేవీ. ప్రతాప్ పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గతంలో ఎస్సీ బాలికల హాస్టల్ కోసం నిర్మించిన భవనాన్ని కలెక్టరేట్‌కు కేటాయించారని, దీంతో ఇతర భవనాల్లోనే హాస్టల్ నిర్వహిస్తున్నారని తెలిపారు. కలెక్టరేట్ ప్రారంభించిన నేపథ్యంలో పాత భవనాన్ని ఎస్సీ విద్యార్థుల వసతిగృహానికి కేటాయించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ చక్రపాణి, అఖిలపక్ష సంఘం నాయకులు నల్ల రవి, దుర్గం ఎల్లయ్య, గడ్డం సతీశ్ యాదవ్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

### ఎస్ఎఫ్ఐ వినతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పాత కలెక్టరేట్ భవనాన్ని ఎస్సీ బాలికల హాస్టల్‌కు కేటాయించాలని సోమవారం పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేతకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి వినతిపత్రం అందజేశారు. లక్సెట్టిపేట, దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నూతన భవనాలు మంజూరు చేయాలని, ఫీజుల నియంత్రణ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని పేర్కొన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని తెలిపారు.



ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న ప్రతాప్, విద్యార్థులు

## రేపు వ్యవసాయాధికారితో 'సాక్షి' ఫోన్ ఇన్

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలం సాగుపై 'సాక్షి' ఆధ్వర్యంలో బుధవారం ఫోన్ ఇన్ నిర్వహించనుంది. జూలై నెల వచ్చినా ఆశించిన వర్షాలు లేకపోవడం, పంటలు విత్తుకునేందుకు అదను, పదును, సమయం, నకిలీ విత్తనాలు, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఏయే పంటలు సాగుకు అనుకూలం తదితర అంశాలపై రైతుల సందేహాలను జిల్లా వ్యవసాయ అధికారి కల్పన నివృత్తి చేయనున్నారు. రైతులు ఫోన్ చేసి సాగుపై సలహాలు పొందవచ్చు.

సాక్షి ఫోన్ ఇన్

సమయం : బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు :

72888 94008 (డీఏవో), 72888 94048 (ఏవో టెక్నికల్)

# పోడు రైతుల కల నెరవేరింది

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్, ఎంపీ

చెన్నూర్: దశాబ్దాలుగా పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిపుత్రుల కల నెరవేరిందని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. సోమవారం స్థానిక సంతోషిమాత ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని 666 మంది పోడు రైతులకు ఎంపీ వెంకటేశ్ నేతతో కలిసి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విప్ మాట్లాడుతూ 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం 2005 డిసెంబర్ 13కు ముందు వరకు సాగు చేసుకుంటున్న రైతులను గుర్తించి పట్టాలు పంపిణీ చేశామన్నారు. హక్కుపత్రాలు ఇవ్వాలని 15 ఏళ్లుగా గిరిపుత్రులు పోరాటాలు చేస్తున్నా గత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పోడు రైతులకు ఈ ఏడాది వానాకాలం రైతుబంధు డబ్బులు ఖాతాలో జమ అవుతాయన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక విపక్ష పార్టీలు చేతకాని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. రేవంత్‌రెడ్డి చంద్రబాబు ఏజెంట్‌గా పనిచేస్తున్నాడని, కాంగ్రెస్‌కు ఓటేస్తే చంద్రబాబుకు వేసినట్లే అవుతుందన్నారు. విపక్ష పార్టీల దొంగ ప్రేమను ప్రజలు నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, అదనపు కలెక్టర్ రాహుల్, ట్రెయినీ కలెక్టర్ గౌతమి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఎంపీపీలు బాపు, సురేఖ, వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్‌రావు, వెన్నపురెడ్డి బాపురెడ్డి, జెడ్పీటీసీ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులపై అలసత్వం వద్దు

చెన్నూర్: అభివృద్ధి పనులపై అలసత్వం వద్దని, పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై అధికారులతో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతతో కలిసి సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీలో పూర్తయిన పనుల నిర్వహణ సక్రమంగా ఉండాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కల్వర్టుల నిర్మాణాలు, రోడ్లు, మిషన్ భగీరథ, మన ఊరు-మనబడి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాధర్, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

# పేదింటి ఆడపడుచులకు పెద్దన్న కేసీఆర్

- పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

దండేపల్లి: పేదింటి ఆడపడుచులకు సీఎం కేసీఆర్ పెద్దన్నలా అండగా ఉంటున్నాడని పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత అన్నారు. సోమవారం దండేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపడుచుల వివాహానికి కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.1,00116 అందిస్తున్నాడని, కేసీఆర్ ప్రవేశపెడుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అంతకుముందు మండలంలోని కాసిపేట, లక్ష్మీకాంతపూర్, లింగాపూర్, చెల్కగూడ గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, తహసీల్దార్ హన్మంతరావు, రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, వైస్‌ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, వెంకటేశ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్



ప్రజా సంఘాల పోరాట వేదిక ధర్నా

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

నస్పూర్: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నామని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి, బెల్లంపల్లి ఆర్‌డీఓ శ్యామలాదేవితో కలిసి సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నరేందర్, అధికారులు పాల్గొన్నారు.

- కాసిపేట మండలం దేవాపూర్ గ్రామానికి చెందిన కోవ మాస్కు తనకు తాత ముత్తాతల నుంచి వారసత్వంగా సంక్రమించిన భూమి వేరొకరు ఆక్రమించుకున్నారని, న్యాయం చేయాలని కోరాడు.
- మందమర్రి మండల కేంద్రానికి చెందిన మేసినేన బుచ్చయ్య తనకు సారంగపల్లి గ్రామ శివారులో భూమి ఉందని, సర్వే నంబరు మార్చి దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశాడు.

### పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలి

చెన్నూర్‌లో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకుడు పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. వేదిక నాయకులు పేదలతో కలిసి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. చెన్నూర్‌లోని బాపురావుపేట శివారు సర్వేనంబరు 8లోని ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనగారపు అశోక్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు దాశరి రాజేశ్వరి, మత్స్యకారులు సంఘం జిల్లా కార్యదర్శి బోడెంకి చందు, నాయకులు పాల్గొన్నారు.

### ఎస్టీ జాబితాలో చేర్చాలి

అణగారిన తెలంగాణ వడ్డెర నవ్య తెగను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి మల్లేశ్ మాట్లాడుతూ బీసీ జాబితాలో ఉండడం వల్ల విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు లేక వెనుకబడి పోతున్నామని తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కోట శరీష్, ఉపాధ్యక్షుడు గంగోలి, తదితరులు పాల్గొన్నారు.

### పోడు పట్టాలు ఇప్పించాలి

కోటపల్లి, జైపూర్, జన్నారం మండలాలకు చెందిన ఎస్టీల వ్యవసాయ భూములకు పోడు పట్టాలు ఇప్పించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఆ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, సర్వే చేసి పోడు పట్టాలు ఇప్పించాలని కోరారు.

### పోడు పట్టా ఇప్పించండి

మాది జన్నారం మండలం గడ్డంగూడెం తండా. నేను గిరిజన రైతును. 1997 నుంచి ఐదు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాను. ఆ భూమిని గతంలో రెవన్యూ అధికారులు సర్వే చేసి హక్కు పత్రాలు ఇవ్వాల్సిందిగా తీర్మానం చేశారు. నేటికీ హక్కు పత్రాలు ఇవ్వలేదు. నా భూమిని సర్వే చేసి పోడు పట్టా ఇప్పించాలి.

– బుక్యా బళ్లిరాం, జన్నారం.

## క్లుప్తంగా

### ఒకరిపై కేసు నమోదు

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని మైలారం గ్రామానికి చెందిన ఈగం సతీష్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. బుర్రి పండుగ సందర్భంగా సతీష్‌కు అదే గ్రామానికి చెందిన జంపం సంపత్‌కు మధ్య గొడవ జరిగింది. పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టారు. తాగిన మైకంలో ఉన్న సతీష్ కర్రతో సంపత్‌పై దాడి చేయగా తలకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### ఇరువర్గాలపై కేసు నమోదు

నెన్నెల: మండలంలోని కుశ్నపల్లిలో పాత కక్షలతో గొడవపడిన ఇరువర్గాలపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. తాటిపల్లి నర్సక్క, సముద్రాల సంతోష్ కుటుంబాలకు ఏడాది కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఎరువుల బస్తాలు తరలించే క్రమంలో మరోసారి జరిగిన గొడవలో నర్సక్క కుటుంబ సభ్యులు సంతోష్ ఇంటికి వెళ్లి దూషించడంతో ఎదురుదాడికి దిగి కొట్టుకున్నారు. తోటపల్లి ప్రశాంత్, తోటపల్లి నర్సక్క, సముద్రాల సంతోష్, సల్ల శ్రీనివాస్, సల్ల సరిత, తోడే మోహన్‌రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

### పామును పట్టబోయి ప్రాణాలొదిలాడు


రమేశ్(ఫైల్)

కౌటాల: పామును పట్టేందుకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటన మండలంలోని కనికిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాయిని రమేష్ (40) మేకల కాపరిగా పని చేస్తున్నాడు. గ్రామంలోని ఓ ఇంట్లోకి నాగు పాము రావడంతో రమేశ్‌ను పిలిచారు. అతను పామును పట్టే క్రమంలో చేతి వేలిపై కాటు వేసింది. చికిత్స నిమిత్తం సిర్పూర్(టి) సామాజిక ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ విషయంపై ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను అడుగగా ఈ ఘటనపై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

### వాగులోపడి వృద్ధురాలు మృతి


సూరమ్మ (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాళ్లపేట శివారులో ఉన్న రాళ్లవాగులో ప్రమాదవశాత్తు పడి వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. మ్యాదరివాడకు చెందిన పిట్టల సూరమ్మ (60) నాలుగేళ్లుగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతోంది. ఈ నెల 2న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. రాళ్లపేట సమీపంలోని వాగులో మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతురాలికి భర్త పోషం, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతురాలి కుమారుడు రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

### ఐటీఐలో ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో సోమవారం ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి ఎలక్ట్రీషియన్ ఫిట్టర్, టర్నర్, ఎంఎంవీ, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, వెల్డర్, కోపా, ఫ్యాషన్ డిజైనర్ కోర్సులకు నిర్వహించిన ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 175 మందికిగానూ 170 మంది హాజరయ్యారు. మూడురోజుల పాటు పరీక్షలు జరుగనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.





జూన్ 27న సాక్షిలో ప్రచురితమైన కథనం

# వీఆర్‌కు ఎస్సై గంగన్న!

- సీఎం టూర్‌కు వ్యాపారుల నుంచి విరాళాలు
- పోలీసు భోజనాల కోసం రూ.లక్షల్లో వసూళ్లు
- 'భోజన ఖర్చులివ్వండి!' శీర్షికతో 'సాక్షి'లో కథనం
- పోలీసు ఉన్నతాధికారి సీరియస్.. విచారణకు ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..


ఎస్సై గంగన్న

సాక్షి, ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సై గంగన్నను వీఆర్‌కు బదిలీ చేశారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కుమురంభీం జిల్లా పర్యటన సందర్భంగా బందోబస్తుకు వచ్చే పోలీసు సిబ్బందికి భోజనాలు ఏర్పాటు పేరిట వ్యాపారుల నుంచి డబ్బులు డిమాండ్ చేశారు. ఇదే అంశంపై జూన్ 27న 'భోజన ఖర్చులివ్వండి!' అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనంపై రాష్ట్ర పోలీసు బాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. జోనల్‌స్థాయి అధికారిని విచారణకు ఆదేశించారు. స్థానిక నిఘా విభాగం అధికారుల ప్రాథమిక విచారణలో ఎస్సై గంగన్న వసూళ్ల పర్వం బయటపడడంతో తొలుత ఎస్సైను వీఆర్‌కు అటాచ్ చేసి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఎస్పీ సురేశ్‌కుమార్‌ను ఆదేశించినట్లు తెలుస్తోంది. దీంతో ఎస్పీ సురేశ్‌కుమార్ ఎస్సై గంగన్నను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందే గంగన్న వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం ఉన్నప్పటికీ.. పర్యటన ముగిసిన రెండోరోజు ఎస్సైపై వేటు వేసి సమగ్ర విచారణ చేపట్టడం గమనార్హం.

**వసూళ్ల వెనుక అదృశ్య శక్తులెవరు?**

రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను అదునుగా తీసుకుని స్థానిక వర్తక సంఘాల నుంచి డబ్బులు వసూళ్లు చేయాలనే ఆలోచన ఎస్సై గంగన్నదేనా? లేక దీని వెనుక ఎవరైనా అదృశ్య శక్తులు ఉన్నాయా? అన్నది ఇప్పుడు విచారణలో ప్రధానంగా తేలాల్సిన విషయం. ఎందుకంటే ఉన్నతాధికారుల ఆదేశాలు ఇసుమంతైనా లేకుండా ఎస్సై గంగన్న అంతటి సాహసానికి పాల్పడడనే వాదనలు పోలీసు శాఖలోనే గుప్పుమంటున్నాయి. పైగా 'సాక్షి' పత్రికలో కథనం వచ్చినా వసూళ్లు ఆగకపోవడం ఎస్సై గంగన్న వెనుక ఎవరో ఉన్నారనే వాదనలకు బలం చేకూరింది. పోలీసుల ప్రాథమిక విచారణలో రూ.5 లక్షలకు పైగా వసూళ్లు చేశారని తేలినట్లు సమాచారం. పోలీసులు సమగ్రంగా విచారణ చేపడితే ఇది మరింత పెరిగే అవకాశం కూడా ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల వాంకిడిలో దొంగనోట్ల కేసు విషయంలోనూ నిందితుడికి స్టేషన్ బెయిల్ ఇచ్చే క్రమంలో రూ.30 లక్షలు చేతులు మారినట్లు ప్రచారం జరిగింది. ఇక్కడా ఆ అదృశ్య శక్తులకే భారీగా వాటాలు ముట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ఎస్సై గంగన్న వసూళ్ల పర్వం వెనుకా కచ్చితంగా అదృశ్య శక్తుల హస్తం ఉన్నట్లు పోలీసు శాఖలో ప్రచారం ఊపందుకుంది. పైగా వసూళ్ల విషయంలో ఎస్సైను మాత్రమే బలిపశువును చేస్తున్నారన్న విమర్శలు సైతం ఉన్నాయి. వాస్తవాలు విచారణలో తేలాల్సి ఉంది.

### ఆది నుంచి ఆరోపణలే..!

ఎస్సై గంగన్నపై ఆది నుంచి అవినీతి ఆరోపణలు ఉన్నట్లు పోలీసుశాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. విధి నిర్వహణలోనూ దురుసుగా ప్రవర్తిస్తారని సమాచారం. చిటికీమాటికి వాహనాలను ఆపడం.. వాహనదారులతో గొడవకు దిగుతున్నారనే విషయం స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధికి తెలిసి ఎస్సైను పిలిచి 'ఇక్కడ పనిచేయాలనుకుంటున్నావా? లేదా?' అని గట్టిగా మందలించాకే కొంత తగ్గినట్లు తెలిసింది. అలాగే ఏదైన కేసు విషయంలో పోలీసుస్టేషన్ మెట్లెక్కితే ఇక అంతే! స్టేషన్ ఉన్నతాధికారి పేరు చెప్పి ఇరువర్గాల నుంచి అందిన కాడికి దండుకుంటారని సమాచారం. ఆదాయానికి మించి ఆర్జించారనే వాదనలు ఆ శాఖవర్గాల్లోనే గుప్పుమంటున్నాయి. జిల్లా కేంద్రంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి బినామీగా ఉన్నారని తెలుస్తోంది. ఆ వ్యాపారి చేసే రియల్ దందాలో ఇతనికి వాటాలున్నాయని సమాచారం. ఇటీవల ఫోర్‌లేన్ రహదారికి ఆనుకుని ఉన్న ఓ రెండెకరాల భూమిని కబ్జా చేసి.. స్థల యజమానులను బెదిరించినా కబ్జాదారులపై ఎలాంటి కేసు నమోదు చేయకపోగా.. ఎస్సై గంగన్న స్థల యజమానులపై కేసు పెట్టి భయభ్రాంతులకు గురిచేశారని బాధితులు వాపోతున్నారు. ఈ కబ్జా కథ వెనుక రియల్ ఎస్టేట్ వ్యాపారి ఉండడంతోనే ఎస్సై గంగన్న రంగంలోకి దిగి మమ్మల్ని బెదిరించారని బాధితురాలు, స్థల యజమాని తారాబాయి ఆరోపిస్తోంది.

### బీపీఏ ఎస్‌వోటూ జీఎంగా నరేందర్


బాధ్యతలు స్వీకరిస్తున్న నరేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా ఎస్‌వోటూ జీఎంగా మచ్చగిరి నరేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్జీ-3 ఏరియా ఓసీపీ-2 ప్రాజెక్టు అధికారిగా విధులు నిర్వర్తించిన ఆయన బెల్లంపల్లి ఏరియా ఎస్‌వోటూ జీఎంగా బదిలీపై వచ్చారు. జీఎం కార్యాలయం సిబ్బంది ఆయకు శుభాకాంక్షలు తెలిపారు.

### కలప పట్టివేత


అధికారులు పట్టుకున్న కలప

జన్నారం: అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకున్నట్లు ఇందన్‌పల్లి రేంజ్ అధికారి హఫీజొద్దీన్ తెలిపారు. కడెం మండలం ఇస్లాంపూర్ నుంచి ట్రాక్టర్‌లో కలప తరలిస్తున్నారని తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందిని అలర్ట్ చేశారు. ఆదివారం రాత్రి కామన్‌పల్లి సమీపంలో ట్రాక్టర్‌ను తనిఖీ చేయగా ఆరు విలువైన టేకు దుంగలు లభ్యమయ్యాయి. స్మగ్లర్లు పారిపోవడంతో టేకు దుంగలతో పాటు ట్రాక్టర్‌ను రేంజ్ కార్యాలయానికి తరలించారు. కలప విలువ రూ.86 వేలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారిపై పీడీయాక్ట్ నమోదు


పీడీ యాక్ట్ పత్రాన్ని అందిస్తున్న సీఐ

రామకృష్ణాపూర్: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న మామిడి శ్రీనివాస్‌పై సోమవారం పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. సీసీసీ నస్పూర్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ పలువురిని భయభ్రాంతులకు పాల్పడటమే కాకుండా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నాడు. ఇటీవల రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నడిపెల్లి లక్ష్మీకాంతారావును హత్యచేశాడని మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. రామగుండం సీపీ రెమా రాజేశ్వరీ ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి చెంచల్‌గూడ జైలుకు తరలించామని సీఐ తెలిపారు.

## హామీలు అమలు చేయకుంటే సమ్మె తప్పదు


మాట్లాడుతున్న దూలం శ్రీనివాస్

మందమర్రిరూరల్: బ్లాస్టింగ్ కాంట్రాక్టర్ కార్మికులకు ఇచ్చిన హామీలను ఈ నెలాఖరు వరకు అమలు చేయనిపక్షంలో నిరవధికసమ్మె తప్పదని కాంట్రాక్ట్ కార్మిక సంఘం రీజియన్ కార్యదర్శి శ్రీనివాస్ హెచ్చరించారు. మూడు రోజులుగా విధులు బహిష్కరించి కార్మికులు సమ్మె చేస్తుండగా సోమవారం కేకేఓసీ పీవో వద్ద చర్చలు జరిగాయి. ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు నెలాఖరు వరకు వేతనాలు అమలు చేయిస్తానని అంగీకరించడంతో సమ్మె విరమించి కార్మికులు ఉద్యోగంలో చేరారన్నారు. హామీ నెరవేర్చకపోతే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ధర్మరాజు, రవి, లింగమూర్తి, సంపత్, సాగర్, రమేశ్, మహేష్, గట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మోసాన్ని ఛేదించిన పోలీసులు

- పోగొట్టుకున్న డబ్బులు తిరిగి బ్యాంకు ఖాతాలో జమ

బెల్లంపల్లి: మోసానికి గురై డబ్బులు పోగొట్టుకున్న ఓ బాధితుడి బ్యాంకు ఖాతాలో తిరిగి డబ్బులు జమ చేయించినట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ ఇంక్లైన్ రడగంబాల బస్తీకి చెందిన మోతీరాం రాజేందర్ తాండూర్ మండలం బోయపల్లిలో ఉన్న సోలార్ ప్లాంట్‌లో మెయింటనెన్స్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. అతనికి గతేడాది డిసెంబర్ 9న గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. తాను ముద్ర ఫైనాన్స్ కంపెనీ నుంచి మాట్లాడుతున్నానని చెప్పి అతన్ని ముగ్గులోకి దింపాడు. మీ సిబిల్ స్కోర్ బాగుంది.. మీకు రూ.లక్ష రుణం ఇస్తామని నమ్మించాడు. అతని మాటలు నమ్మిన రాజేందర్ అపరిచిత వ్యక్తి బ్యాంకు ఖాతాలో రూ.13,100 జమ చేశాడు. ఆతర్వాత మోసపోయానని గుర్తించి సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫోన్ చేసి ఖాతాను ఫ్రీజ్ చేయించాడు. ఈ మేరకు బెల్లంపల్లి టూటౌన్‌లో నిందితుడిపై కేసు నమోదు చేసిన సీఐ రాజ్‌కుమార్ గౌడ్ దర్యాప్తు చేపట్టారు. ఢిల్లీకి చెందిన ఓ వ్యక్తి బ్యాంకు ఖాతాకు నగదు పంపించినట్లు గుర్తించారు. విషయాన్ని బెల్లంపల్లి సివిల్ కోర్టు న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లి నిందితుడి బ్యాంకు ఖాతా నుండి బాధితుడి ఖాతాకు నగదు బదిలీ చేయించాడు.

## బెస్ట్ అవేలబుల్ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: ప్రస్తుత విద్యాసంవత్సరానికి గానూ బెస్ట్ అవేలబుల్ పాఠశాలల్లో ప్రవేశానికి షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులు ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పి.రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెసిడెన్షియల్‌లో 5వ తరగతి, నాన్ రెసిడెన్షియల్‌లో 1వ తరగతిలో జిల్లాకు 183 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. 1వ తరగతిలో 91, 5వ తరగతిలో 92 సీట్లు కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. మీసేవ ద్వారా జారీ చేయబడిన కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం (గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షలు మించి ఉండకుండా), జనన ధృవీకరణ పత్రం(1వ తరగతికి 2017 జూన్ 1 నుంచి 2018 మే 31 లోపు), 5వ తరగతి కోసం 4వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి), ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, 3 పాస్ ఫొటోలు, గతేడాది మార్కుల జాబితా, బోనఫైడ్ దరఖాస్తుతో జతచేయాలని సూచించారు. 20న కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు.

### అక్రమ నిర్మాణాలు ఆపాలని వినతి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: లక్సెట్టిపేట మున్సిపాలిటీ ఉత్కూర్ శివారులోని సర్వేనంబర్ 375లో ఉన్న ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలు వెంటనే నిలిపివేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి లాల్‌కుమార్, ఏరియా కార్యదర్శి దొండ ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాహుల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో 25 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని నివాసముంటున్న వారిని ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని, గుడిసెలను జేసీబీతో తొలగిస్తామని కొంతమంది బెదిరిస్తున్నారన్నారు.

### మహిళను హత్యచేసిన నిందితులను శిక్షించాలి

పాతమంచిర్యాల: ఆదివాసీ మహిళపై అత్యాచారం జరిపి హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆదివాసీ తోటి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు వల్క చిలుకయ్య ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్ బదావత్ సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ధనోరలో కుద్మేత జంగుబాయిపై అత్యాచారం చేసి హత్యచేసి బావిలో పడేసిన మానవ మృగాలను ఉరి తీయాలన్నారు. గిరిజన మహిళలపై ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన నిబంధనలు తీసుకురావాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్సింగ వెంకటేశ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కుద్మేత తిరుపతి, తుడుం దెబ్బ జిల్లా మహిళా అధ్యక్షురాలు దుర్వ చిలుకుబాయి, నాయకులు కుమారస్వామి, రాంబాయి, సరస్వతి, భవానీ, సతీష్, దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్యంపై దృష్టి

- పోడు పట్టాల పంపిణీ సజావుగా సాగేలా చర్యలు
- గిరిజన సమస్యలపై అవగాహన ఉంది
- ఈ ప్రాంతాల్లో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా..
- దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తా
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్


చాహత్ బాజ్‌పాయ్, ఉట్నూర్ ఐటీడీఏ పీవో

సాక్షి,ఆదిలాబాద్: ప్రభుత్వ పథకాలను గిరిజనులకు వందశాతం దరిచేరేలా కృషి చేస్తానని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆమె రోజంతా బిజీబిజీగా గడిపారు. ఉదయం 9గంటల్లోపే ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి నుంచి చార్జ్ తీసుకున్నారు. అనంతరం ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. ఆ తర్వాత ఉట్నూర్ చేరుకున్నారు. తొలిరోజు గ్రీవెన్స్‌లో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. అంతకుముందు ఐటీడీఏ అధికారులు, సిబ్బంది నూతన పీవోను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టనుండగా వాటి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా పీవో చాహత్ బాజ్‌పాయ్ 'సాక్షి'తో మాట్లాడారు.

**సాక్షి:** గిరిజన సమస్యలపై అవగాహన ఉందా..?

**పీవో:** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో అదనపు కలెక్టర్‌గా పనిచేస్తుండగా గిరిజన సమస్యలపై అనేక మంది నన్ను కలవడం జరిగింది. ఆదివాసీ, గిరిజన సమస్యలపై అవగాహన ఉంది. ఈ ప్రాంతాల్లో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను.

**సాక్షి:** విధుల నిర్వహణలో మీ ప్రాధాన్యత అంశాలు..?

**పీవో:** గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధి, వైద్య సేవలు మరింతగా మెరుగుపరిచే విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తాను. ప్రభుత్వ పథకాలను వంద శాతం గిరిజనులకు అందేలా తొలిరోజు నుంచే నా ప్రయత్నం కొనసాగుతుంది.

**సాక్షి:** వసతిగృహాల్లో సమస్యలు పేరుకుపోయాయి. సరుకుల పంపిణీ జరగడం లేదు. మీ దృష్టికి వచ్చిందా..?

**పీవో:** వసతిగృహాల్లో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడతాను. ఈ విషయంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో చర్చిస్తాను. సరుకుల పంపిణీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను.

**సాక్షి:** ఐటీడీఏ సమావేశాలు నిరంతరంగా జరగడం లేదు. ఈ విషయంలో మీరేమంటారు..?

**పీవో:** బాధ్యతలు చేపట్టిన వెంటనే ఐటీడీఏలోని అన్ని విభాగాల అధికారులతో వివిధ అంశాలపై చర్చించాను. ఐటీడీఏ సమావేశాలు నిరంతరం కొనసాగేలా చర్యలు చేపడతాను.

**సాక్షి:** పోడు పట్టాల పంపిణీలో ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

**పీవో:** పోడు పట్టాల పంపిణీ మంగళవారం కేబీ కాంప్లెక్స్‌లో ప్రారంభించనున్నాం. ఈ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు చేపడతాం. ఏజెన్సీ ప్రాంతాల్లో దశల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను.

## 'కూలి'న బతుకులు

- విద్యుత్ స్తంభాలు తరలిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా
- ఇద్దరు అన్నదమ్ములు మృతి
- బెజ్జూర్ మండలం ముంజంపల్లిలో విషాదం


సంఘటన స్థలంలో స్తంభాల కింద వసంత్, అనిల్ మృతదేహాలు


ప్రాణాలతో బయటపడ్డ డ్రైవర్ చిలుకయ్య

కౌటాల(సిర్పూర్): వారిద్దరూ తోబుట్టువులు.. కష్టజీవులు.. కుటుంబానికి పెద్ద దిక్కులేకపోవడంతో ఏ పూటకాపూట కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సొంత ఊరిలో 'ఉపాధి' దొరక్క, కుటుంబాన్ని పస్తులుంచడం ఇష్టం లేక వారంతా 20 కిలో మీటర్ల దూరం కూలి పనులకు వెళ్తున్నారు. వచ్చిన కూలితో కుటుంబాన్ని పోషికుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం సద్దిబువ్వ సిద్ధం చేసుకుని పనికి వెళ్లారు. ఇంతలో రోడ్డు ప్రమాదరూపంలో వారిని మృత్యువు కబళించింది.

**నలిగిన బతుకులు**

కుమురంభీం జిల్లా బెజ్జూర్ మండలంలోని ముంజంపల్లికి చెందిన బుర్రి వసంత్(26), బుర్రి అనిల్ (24) ఇద్దరు అన్నాతమ్ముళ్లు. గ్రామానికి చెందిన జంబుల చిలుకయ్య, తిరుపతి, రాకేష్, సుధాకర్‌తో కలిసి కౌటాలకు చెందిన విద్యుత్ కాంట్రాక్టర్ ఉప్పుల సత్తయ్య వద్ద కూలి పనికి వచ్చారు. వీరంతా కొంతకాలంగా విద్యుత్ స్తంభాల తరలింపు పనులకు వస్తున్నారు. ఈక్రమంలో సోమవారం వసంత్, అనిల్, చిలుకయ్య గుడ్లబోరిలో విద్యుత్ స్తంభాలను ట్రాక్టర్ ట్రాలీలో లోడ్ చేసుకుని అక్కడికి సుమారు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న పని ప్రదేశానికి బయలు దేరారు. డ్రైవర్ చిలుకయ్య ట్రాక్టర్ నడుపుతుండగా పక్కన వసంత్, అనిల్ కూర్చున్నారు.


బుర్రి వసంత్ (ఫైల్)


బుర్రి అనిల్ (ఫైల్)

వైగాం గ్రామానికి సమీపంలోకి రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి ట్రాలీ తిరగబడింది. ఈ క్రమంలో చిలుకయ్య, వసంత్, అనిల్ ట్రాక్టర్ ఇంజన్ పక్కకు పడిపోయారు. వసంత్‌కు స్తంభాలు బలంగా ఢీకొనగా అనిల్ మీద రెండు స్తంభాలు పడ్డాయి. దీంతో సోదరులిద్దరూ సంఘటన స్థలంలోనే మృతి చెందారు. డ్రైవర్ చిలుకయ్య తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108లో సిర్పూర్(టి) ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్సై ప్రవీణ్‌కుమార్ సందర్శించి వివరాలు సేకరించారు. మృతదేహాలను సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రికి తరలించారు.

**అధికలోడే కారణమా?**

విద్యుత్ పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ట్రాలీలో పరిమితికి మించి 11 భారీ సిమెంట్ స్తంభాలతో పాటు ఇతర విద్యుత్ పరికరాలను తరలించడంతోనే ఘటన జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు.

**ఆ కుటుంబానికి దిక్కెవరు?**

బెజ్జూర్ మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన బుర్రి నీలయ్య-హంసక్క దంపతులకు కుమారులు వసంత్, అనిల్, కూతురు వనిత ఉన్నారు. వీరి చిన్నతనంలోనే తండ్రి మృతి చెందాడు. తల్లి హంసక్క ముగ్గురిని పెంచి పెద్ద చేసింది. వసంత్‌కు ఆర్నెళ్లక్రితం వివాహమైంది. అనిల్ చదువుమానేసి అన్నతో కలిసి పనికి వెళ్తున్నాడు. కుమారులిద్దర్నీ ఒకేసారి ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబళించడంతో ఆ ఇంటికి మగదిక్కు లేకుండా పోయింది.

## జీవో 22 ప్రకారం వేతనాలు పెంచాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

రెబ్బెన(ఆసిఫాబాద్): జీవో 22 ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తొమ్మిదేళ్లుగా కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాల జీవోలను సవరించడంన్నారు. ధరలు పెరుగుతున్నా వేతనాలు పెరగకపోవటంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సింగరేణిలో 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పర్మినెంట్ కార్మికులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా నేటికీ కనీస వేతనాలకు నోచుకోవడం లేదన్నారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో పర్యటించిన సీఎం కేసీఆర్ కాంట్రాక్టు కార్మికుల గురించి ఒక్క మాట కూడ మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. జీవో 22ను వెంటనే గెజిట్ చేసి కార్మికుల వేతనాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తయ్య, కార్మికులు బాలేష్, గోపాల్, సుమలత, రాజేశ్, దీపక్, రాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### 16 మందికి పోడు పట్టాలు

భీమారం: మండలంలోని 16 మంది పోడు రైతులకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ పట్టాలు అందజేశారు. ఈ మేరకు చెన్నూరు పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలంపల్లిలో 2, రెడ్డిపల్లిలో 13, బూర్గుపల్లిలో ఒకరికి హక్కుపత్రాలు అందజేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.


పట్టాలు అందజేస్తున్న అదనపు కలెక్టర్